క్లుప్తంగా

ఘనంగా చిన్నారులకు అన్నప్రాసన



అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ అంగన్‌వాడీ 3వ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల మాట్లాడారు. అంగన్‌వాడీలో ఇచ్చే బలవర్ధక ఆహారంతో చిన్నారులు త్వరితగతిన ఎదుగుతారని తెలిపారు. 6 నెలలు నిండిన ప్రతి చిన్నారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం ఇస్తారన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నస్రీన్‌బేగం, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం
జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: పల్లెల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సాలార్‌పూర్ గ్రామ పంచాయతీలో రూ.5లక్షల జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎంపీటీసీ ప్రియారమేశ్‌తో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పంతునాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్, బాబాకుమార్, రాజు, అంజయ్య, జైపాల్, అనిల్, శ్రీరాములు,, శ్రీను, రమేశ్, ఈశ్వరప్ప తదితరులు ఉన్నారు.

నేడు రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ గేట్ సమీపంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్లో బుధవారం మధ్యాహ్నం రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నారని.. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కార్యకర్తలు, రైతులు తదితరులు సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ఆశ వర్కర్ల నూతన కార్యవర్గం

తలకొండపల్లి: ఆశ వర్కర్ల మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పడకల్ జల్లెల పెంటయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా ఎల్.కవిత, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శిరీష, కోశాధికారిగా నిర్మల, సహాయ కార్యదర్శిగా యాదమ్మలతో పాటు, మరో 15 మంది కార్యవర్గ సభ్యురాళ్లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు ఎన్నికైనట్లు ధ్రువ పత్రాలను పెంటయ్య అందజేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని రాయపోల్ గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ కృపేశ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన ముచ్చటించి సాధకబాధకాలు తెలుసుకున్నారు. పనిచేసిన కూలీలకు ప్రతి నెలా డబ్బులు అందే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళుతానని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీటీసీ మంగరవీందర్, సూపరింటిండెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగులకు నియామకపత్రాలను ఎంపీపీ కృపేశ్ అందజేశారు. టాటా మోటార్స్, డీ మార్ట్ మేళాను నిర్వహించాయి.

ఫౌండేషన్‌కు విరాళం



ఫౌండేషన్ నిర్వాహకుడికి విరాళం అందజేస్తున్న గోపాల్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లో స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్‌లోని దివ్యాంగుల సమక్షంలో ఆదిబట్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ తన జన్మదినోత్సవాన్ని మంగళవారం జరుపుకొన్నారు. మడుపు శివసాయి ఆధ్వర్యంలో గోపాల్ కేట్ కట్ చేశారు. అనంతరం వసతి గృహానికి రూ.50 వేలు విరాళం అందజేశారు.

నేటితో సంపూర్ణం

ఐదేళ్లుగా సేవలందించిన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

- ముగిసిన మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం
- ఎన్నికలు నిర్వహించాలని ఆశావహుల వినతి

స్థానిక సంస్థలో పాలనావ్యవస్థ పూర్తిగా ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. ప్రస్తుతం ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలుగా కొనసాగుతున్న సభ్యులు మాజీలు అవ్వనున్నారు. ఐదేళ్ల పాటు ప్రజాసేవలో నిమగ్నమయిన నాయకులు తప్పుకోనున్నారు. దీంతో సర్పంచులతో పాటు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆశావహులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల్లో ముఖ్యమైన మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం బుధవారంతో ముగుస్తోంది. ప్రస్తుతం పదవీలో ఎంపీపీ, ఎంపీటీసీలు మాజీలు కాబోతున్నారు. జెడ్పీటీసీలకు గురువారం వరకు అవకాశం ఉంది. ఎలాంటి వివాదాలకు, సంక్షోభాలకు తావులేకుండా ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలన్ని పూర్తి చేసింది. ఆత్మీయ వీడ్కోలు సభను బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. మండలంలోని 10 మంది ఎంపీటీసీల్లో మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్‌కు, జెడ్పీటీసీ మాత్రం కాంగ్రెస్‌కు చెందినవారున్నారు. పోచారం ఎంపీటీసీ కృపేశ్ మండల పరిషత్ అధ్యక్షుడిగా, ఆదిబట్లకు చెందిన భూపతిగాళ్ల మహిపాల్ జెడ్పీటీసీగా ఐదేళ్ల పాటు సేవలందించారు. మొదట్లో ఎంపీపీ, జెడ్పీటీసీల మధ్య ప్రత్యేక గది కేటాయింపు తదితర విషయాల్లో సమస్యలు తలెత్తినా తరువాత సద్దుమణిగింది. తమ పదవీకాలంలో గ్రామాలకు చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు నాయకులు నెమరేసుకుంటున్నారు.

సర్పంచ్‌లకు తోడుగా ఎంపీటీసీలు

గత ఫిబ్రవరి 2న సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులొచ్చిన విషయం తెలిసిందే. మాజీ గ్రామ సర్పంచ్‌లకు తోడుగా ఎంపీటీసీలు సైతం మాజీలు కాబోతున్నారు. ఇక మండలానికి ప్రత్యేకాధికారి బాధ్యత తీసుకుంటారు. దీంతో గ్రామస్థాయిలో పరిపాలన పూర్తిగా ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

వీడ్కోలు పలకనున్నాం



మండల ప్రజాపరిషత్ ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం బుధవారంతో, జెడ్పీటీసీ పదవీకాలం గురువారంతో ముగుస్తుంది. ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన పాలకవర్గానికి వీడ్కోలు పలకనున్నాం. మండలానికి ప్రత్యేకాధికారిగా నవీన్‌రెడ్డి రాబోతున్నారు.
వెంకటమ్మ, ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

ఆలస్యమవుతున్న ఎన్నికలు

తలకొండపల్లి: ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాజీలుగా మారనున్నారు. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికలను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆలస్యమవుతోంది. మండలంలో 12 ఎంపీటీసీలుండగా అందులో జంగారెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు తిర్మణీ నిర్మలాశ్రీశైలంగౌడ్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా, గట్టుఇప్పలపల్లి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యక్షుడిగా, పడకల్ ఎంపీటీసీ సభ్యుడు రమేశ్ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా, మరో 9 మంది ఎంపీటీసీ సభ్యులుగా, ఉప్పల వెంకటేశ్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఐదేళ్లు కొనసాగారు. అయితే గురువారంతో వీరందరి పదవీ కాలం ముగియనుంది.

ఆశావహులకు నిరాశ

ఇప్పటికే గ్రామ పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల ఆశావహులు సర్పంచ్ ఎన్నికల్లో గెలువాలనే ఉద్దేశంతో ప్రజల మధ్యన నిరంతరం తిరుగుతున్నారు. నజరానాలు, నయానా, భయానా ఇవ్వడంతో పాటు, ఆర్థికసాయం చేసి ప్రజలను మచ్చిక చేసుకున్నారు. తీరా సర్పంచ్ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించకపోవడంతో ఆశావహులు నిరాశకు లోనయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సైతం పోటీ నెలకొంది.

ఎన్నికలు నిర్వహించాలి



మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీలకు పదవీ కాలం ముగిసిన వెంటనే సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. పడకల్ ఎంపీటీసీగా ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాను.
– రమేశ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, పడకల్

ప్రత్యేక పాలనలో ఇబ్బందులు



స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు అనేక ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. స్థానిక సంస్థలకు సమయానుగుణంగానే ఎన్నికలు నిర్వహించాలి. **– కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన**

ప్రజాసేవ సంతృప్తి నిచ్చింది

ఎంపీపీ కొప్పు సుకన్య



మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: ఎంపీపీగా ఐదేళ్లు ప్రజలకు సేవ చేయడం ఎంతో తృప్తినిచ్చిందని కొప్పు సుకన్య అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగుస్తున్న దృష్ట్యా మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరంగా భావించానని అన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులకు ఎంపీపీ సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి సత్కరించారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు లక్ష్మమ్మ, లక్ష్మీపతిగౌడ్, బావయ్య, జ్యోతి, ఇస్రత్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి



కడ్తాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తలకొండపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం..



ఇబ్రహీంపట్నం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నేతలు

- బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్
- తహసీల్దార్ కార్యాలయంలో నాయకుల వినతి

కడ్తాల్: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ డిమాండ్ చేశారు. బీజేవైఎం పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగీరథ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రూప్1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూప్2, గ్రూప్3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాన్యనాయక్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

తలకొండపల్లి: జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్న నిరుద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు నీలకంఠం పాండు, మహేశ్, కృష్ణ, కుమార్, కిరణ్, రాము, మధుసూదన్, అర్జున్, రామకృష్ణ, జగదీశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

యాచారం: ప్రస్తుత సర్కారు నిరుద్యోగులను మోసం చేస్తుందని బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగుడాల శ్రీశైలం పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అమలు చేయాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రవీందర్, శాంతికుమార్, కృష్ణ, బీరప్ప, ఐలేశ్, శ్రీనాథ్, నాగరాజు, శివమోదీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేస్తున్న ప్రభుత్వాలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నిరుద్యోగులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని బీజేవైఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కన్వీనర్ వి.రవీందర్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మండలంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రూపక్, విజయ్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మాడ్గుల: ప్రజల కోసం పని చేసే వారికే భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పద్మారెడ్డి అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో సమస్యలపై చర్చించారు. అనంతరం స్థానిక ఎంపీటీసీలు మండలంలో విద్యుత్ సమస్యలతో పాటు గ్రామాలు, తండాల్లో బీటీ రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. నియోజకవర్గంలో వంద ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తునున్నట్లు వెల్లడించారు. విద్యా, వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు మెరుగైన సదుపాయలు కల్పిస్తానని చెప్పారు. అనంతరం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, ఎంపీటీసీలను ఎమ్మెల్యే కసిరెడ్డితో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఎంపీటీపీ సభ్యులు కిషన్ రెడ్డి, పాండుగౌడ్, జైపాల్‌రెడ్డి, నారాయణ, చంటి, కృష్ణమ్మ, లక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండలంలోని చరికొండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగయ్య, చిందం గుండాలు మంగళవారం మృతి చెందారు. బాధిత కుటుంబాలను స్థానిక ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలకు రూ.ఐదు వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మంచాల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడ కొండ గ్రామంలో రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆమె ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల అవసరాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు అధికంగా నిధులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, నాయకులు పాండు, లచ్చిరాం, శివ, బావోజీ, బాలాజీస్వామి, మోతిరాంహర్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా వికారాబాద్ ఇన్‌చార్జిగా పురుషోత్తం



తుర్కయంజాల్: ఎస్సీ మోర్చా వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌కు చెందిన కొంద్రు పురుషోత్తం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కొరకు మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యులు బోసుపల్లి ప్రతాప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాగు చేసే అందరికీ రైతుభరోసా

అభిప్రాయ సేకరణలో రైతుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: పంటల సాగు చేసే ప్రతి ఒక్కరికి రైతుభరోసా ఇవ్వాలంటూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లా సహకార శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణకు సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్లాట్లుగా మార్చిన భూములతో పాటు వ్యవసాయానికి అనువుగా లేని భూములకు రైతుభరోసాను నిలిపి వేయాలన్నారు. వ్యవసాయం చేసే ప్రతి రైతులకు నిబంధనలు పెట్టకుండా సాయం అందించాలన్నారు. ఇన్‌కం టాక్స్ నిబంధనను తొలగించాలని అన్నారు. కాగా రైతుల అభిప్రాయాలను, సూచనలను నమోదు చేసుకున్న జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ నాగలింగాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ పురం యాదగిరిరెడ్డి, వ్యవసాయశాఖ డివిజన్ సంచాలకుడు వెంకటేశ్వర్లు, ఏఓ కవిత, డైరెక్టర్లు యాదిరెడ్డి, బాల్‌రెడ్డి, బాలనరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాములు, లక్ష్మమ్మ, మహిపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ రాకేశ్‌గౌడ్ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



కార్యక్రమంలో జిల్లా అధికారి పద్మజారమణ తదితరులు

మంచాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టనున్న ప్రీ ప్రైమరీ స్కూల్ బోధనపై మంగళవారం మంచాల రైతు వేదికలో టీచర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు విద్యబోధన విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణ, సూపర్‌వైజర్లు కల్పన, సత్తమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కడ్తాల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశంలపై సమీక్షించేందుకు ఉదయం నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధుల వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని కోరారు.

బిల్లులు రాక.. అప్పులు తీరక

- అవస్థల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఏడు నెలలుగా పెండింగ్
- యాచారంలో రూ.30 లక్షలకు పైగా బకాయిలు

బాలల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో చిన్నారులు గణనీయంగా బడిబాట పట్టారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ పథకంలో పెండింగ్ బిల్లుల సమస్య కలకలం రేపుతోంది. కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సకాలంలో బిల్లులు అందడం లేదు.



చింతపట్లలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది (ఫైల్)

యాచారం: మధ్యాహ్న భోజనాన్ని అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సిన దుస్థితి సిబ్బందికి ఏర్పడింది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. మండలంలోని 24 గ్రామాల్లో పది ఉన్నత, ఒక ఆదర్శ, ఆరు ప్రాథమికోన్నత, 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 4,200 మందికి పైగా ఉన్నారు. విద్యార్థులకు బియ్యాన్ని ప్రభుత్వమే అందజేస్తుండగా, కూరగాయలు, గుడ్లు, వంట సిబ్బందికి జీతాలకు సైతం ప్రత్యేకంగా ఇస్తుంది.

అప్పులు చేసి కొంటున్న సరుకులు

మధ్యాహ్న భోజన సిబ్బందికి ఏడు నెలలుగా బిల్లులు అందడం లేదు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో వంట సిబ్బంది అధిక వడ్డీకి అప్పులు చేసి వంట సరుకులు కొంటున్నారు. వంట సిబ్బందికి కూరగాయల కొనుగోలుకు గాను ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గాను రూ.10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతి నెలా కూరగాయలు, గుడ్లకు కలిపి రూ.5 నుంచి రూ.6 లక్షలకు పైగానే ఖర్చు అవుతుంది. ఇలా ఏడు నెలలుగా సిబ్బందికి దాదాపు రూ.30 నుంచి రూ.35 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల కోసం నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసిన ప్రయోజనం కరువైంది.

గౌరవ వేతనం లేదు

మండలంలోని గునుగల్‌లో ఉన్న ఒక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతారు. మధ్యాహ్న భోజనం వండటానికి మొత్తం 84 మంది సిబ్బంది పనిచేస్తారు. వీరికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నెలకు రూ.మూడు వేల చొప్పున గౌరవ వేతనం అందుతుంది. ఇవి కూడా సక్రమంగా అందడం లేదు. కూరగాయల ఖర్చు, గుడ్లు కొనుగోలుకు అప్పులు చేస్తున్నారు. అయినా సరైన గౌరవం కూడా దక్కడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

వడ్డీని భరించలేం



ఏడు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు, గౌరవ వేతనాలు అందడం లేదు. వంట సామగ్రి కొనుగోలుకు రూ.రెండు లక్షల వరకు అప్పులు చేశాం. అధిక వడ్డీని భరించలేక పోతున్నాం. బంగారు నగలు సైతం తాకట్టు పెడుతున్నాం.
– కళమ్మ, వంట సిబ్బంది, నందివనపర్తి

బకాయిలు వాస్తవమే



మండలంలోని పలు పాఠశాలలకు మధ్యాహ్న భోజన బిల్లులు బకాయిలున్నది వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. బియ్యంలో నాణ్యత లేకుంటే వంట సిబ్బంది సమాచారం అందించాలి.
– వెంకట్‌రెడ్డి, ఎంఈఓ, యాచారం

బిల్లులు అందేలా కృషి



మధ్యాహ్న భోజన సిబ్బందికి బిల్లులు సకాలంలో రావడం లేదని, అప్పులు చేసి సామగ్రి తెస్తున్నామని ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై డీఈఓతో మాట్లాడుతా. సకాలంలో బిల్లులు అందేలా కృషి చేస్తా. రూ.లక్షల్లో బకాయిలు ఉండడం పెద్ద భారమే.
– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం